నేడు కమిషనర్ ఫోన్ ఇన్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ప్రజాసమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని వాటికి పరిష్కారం చూపేందుకు ప్రతి సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో 'ప్రజావాణి' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే నేడు ప్రజావాణితో పాటు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌తో 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, సమస్యలు చెప్పుకోవాలనుకునే వారు 040-23222182కు ఫోన్ చేయాలని సూచించారు. ఉదయం 10. 30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణిలో అర్జీలు స్వీకరించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

క్రీడలతోనే శారీరక దృఢత్వం

క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

శామీర్‌పేట, ఫిబ్రవరి 4: క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం సాధ్యపడుతుందని అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ అన్నారు. జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం శామీర్‌పేట క్రీడా పాఠశాలలో నిర్వహించారు. జిల్లా స్థాయి క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 10న కొత్తగూడెంలో జరిగే 12వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ సోలాపూర్ స్వాములు, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి సమ్మయ్య, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభుదాస్, సహ కార్యదర్శి అశోక్ దయాళ్, వీరశేఖర్, రవి, మణికంఠ, హరివర్ధన్ రెడ్డి, సురేందర్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

మేము సైతం స్టీరింగ్ పట్టి..గేర్ మారుస్తాం

- డ్రైవింగ్‌పై యువతులు, గృహిణుల అధిక ఆసక్తి
- గత ఏడాది 42,557 లైసెన్స్‌లు జారీ
- ఈ ఏడాది ఇప్పటి వరకు 1765 యువతులకు లైసెన్స్‌లు
- రాష్ట్రంలో లైసెన్స్ జారీలో గ్రేటర్ వాటే అధికం

డ్రైవింగ్ నేర్చుకుంటున్న మహిళ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : స్టీరింగ్ తిప్పుతూ..గేరు మార్చుతూ మహిళలు రోడ్లపై వాహనాలను పరుగెత్తిస్తున్నారు. నగరంలో స్కూటీ, కారు డ్రైవింగ్ నేర్చుకోవడంపై యువతులు అమితాసక్తి ప్రదర్శిస్తున్నారు. శిక్షణ తీసుకొని డ్రైవింగ్ టెస్ట్‌లకు హాజరవుతూ లైసెన్స్ పొందుతున్నారు. నగర బిజీ జీవితంలో ఇప్పుడు వాహనం నడపడం అనివార్యంగా మారింది. కార్యాలయాలకు వెళ్లడం.. పిల్లలను స్కూల్ వద్ద డ్రాప్ చేయడం.. తిరిగి ఇంటికి తీసుకురావడం.. పండుగలకు ఊరెళ్లడం.. ఇలా మహిళలకు డ్రైవింగ్ తప్పనిసరిగా మారింది. గతంలో సిటీలోని మొత్తం డ్రైవింగ్ లైసెన్సులలో ఒకటి, రెండు శాతంలోనే ఉండేది మహిళల సంఖ్య. కానీ, ఇప్పుడు 50 శాతం వరకు లైసెన్స్‌లో వారీ వాటా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది 42,557 మంది మహిళలు లైసెన్స్ పొందగా ఈ ఏడాది ప్రస్తుతం వరకు 1765 మంది లైసెన్స్ పొందారు.

కారుకేజై..!!

గ్రేటర్‌లో సుమారు 400లకు పైగా డ్రైవింగ్ స్కూళ్లు ఉన్నాయి. వీటితోపాటు మరో 50 నుంచి 60 వరకు మారుతి, టయోటా లాంటి కంపెనీ డ్రైవింగ్ స్కూళ్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఒక్కో బ్యాచ్‌కు కనీసం 20నుంచి 35 మంది చొప్పున కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలో 2019 నుంచి ఇప్పటి వరకు 1.57 లక్షల మంది మహిళలు డ్రైవింగ్ లైసెన్స్ పొందారు. ఇందులో అధిక భాగం ఫోర్ వీలర్ లైసెన్స్ ఉన్నవాళ్లే. గ్రేటర్‌లో మొత్తం 4.27 లక్షలకు పైనే డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న మహిళలు ఉన్నారని ఆర్టీఏ లెక్కలు చెబుతున్నాయి.

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇలా...

2019	- 30555
2020	- 20851
2021	- 29,898
2022	- 31,902
2023	- 42,557
2024 ప్రస్తుతం	- 1765
మొత్తం	1,57,528

సరైన శిక్షణ తీసుకోవాలి..

డ్రైవింగ్ నేర్చుకోవడానికి మహిళలు చాలా ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఇది చాలా మంచి పరిణామం. అందులోనూ ఫోర్ వీలర్ లైసెన్స్ పొందే వారి సంఖ్య అధికం. నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్న డ్రైవింగ్ స్కూళ్లలోనే శిక్షణ తీసుకోవాలి. రోడ్డు నిబంధనలన్నీ క్షుణ్ణంగా గుర్తించుకోవాలి. రోడ్డు ప్రమాదాలకు తావులేకుండా డ్రైవింగ్ నేర్చుకోవాలి. ఆలస్యమైనా పర్లేదు కానీ వచ్చిరానీ డ్రైవింగ్‌తో లైసెన్స్ పొందాలని ప్రయత్నిస్తే కుదరదు. ఆర్టీఏ నిర్వహించే అన్ని టెస్టుల్లో ఉత్తీర్ణత సాధించాలి.

- రవీందర్ కుమార్, ఆర్టీఏ, ఉప్పల్

పుస్తకావిష్కరణ

మాయని గాయాల నెత్తుటి చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఘంటా చక్రపాణి, అల్లం నారాయణ, రచయిత మంగళారపు లక్ష్మణ్

రవీంద్రభారతి, ఫిబ్రవరి 4: ప్రముఖ రచయిత మంగళారపు లక్ష్మణ్ రచించిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. జర్నలిస్టు జకీర్ సభాధ్యక్షత వహించిన ఈ పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథులుగా తెలంగాణ స్టేట్ పబ్లిక్ కమిషన్ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, విశిష్ట అతిథిగా ప్రెస్‌అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, తెలంగాణ నీటివనరుల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ... మంగళారపు లక్ష్మణ్ ఒక జర్నలిస్టుగా, రచయితగా తన అనుభవాలను, అప్పటి నెత్తుటి చరిత్రను కళ్లకు గట్టినట్టుగా ఈ పుస్తకాన్ని రచించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కవి, రచయిత డా.తైదల అంజయ్య, తెలంగాణ పబ్లిక్ కమిషన్ మాజీ మెంబర్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకుంటాం



ఈడెన్ గార్డెన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సత్కరిస్తున్న సంస్థాన్ ప్రతినిధులు

మంత్రి పొన్నం ప్రభాకర్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 4: రాష్ట్రంలోని దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉదయ్‌పూర్‌లోని నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం కింగ్ కోఠిలోని ఈడెన్ గార్డెన్‌లో ఉచితంగా స్క్రీనింగ్, డయాగ్నసిస్, ఆర్టిఫిషియల్ లింబ్, కాలిఫర్స్, కొలతల శిబిరం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నారాయణ్ సేవా సంస్థ ఉచితంగా కృతిమ అవయవాలను అందించడం అభినందనీయమన్నారు. సుమారు 1500మంది దివ్యాంగులు ఈ శిబిరానికి హాజరుకాగా, 150 మందికి ఆపరేషన్, 850 మందికి కృతిమ అవయవాల కోసం కొలతలు తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క సతీమణి నందిని, నారాయణ్ సేవా సంస్థాన్ డైరెక్టర్ దేవేంద్ర చౌబిసా, కో-ఆర్డినేటర్ అల్కా చౌదరి, ప్రతినిధులు జస్మిత్ పటేల్, భగవాన్ ప్రసాద్ గౌర్, రితేశ్ జగీర్దార్, ప్రశాంత్ అగర్వాల్, నరేంద్రసింగ్ చౌహాన్, ఉత్తమ్ దమ్రాణి అభయ్ చౌదరి, హరిప్రసాద్, రాకేశ్ శర్మ, ఐశ్వరీ త్రివేది, శశిగాంధీ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిచ్చి తీరుతాం

డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి హామీ

సీఎంను కలిసిన జర్నలిస్టులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బొల్లోజు రవి, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు దండా స్వామి రెడ్డి, సభ్యుల బృందం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టుల సొంతింటి కలను సీఎం రేవంత్ రెడ్డి సాకారం చేస్తారనే విశ్వాసాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంపై సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో చర్చించి త్వరలోనే ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జర్నలిస్టులకు ఎలా ఇళ్ల స్థలాలు కేటాయించాలనే దానిపై ఒక నిర్ణయం తీసుకుంటామని ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

నగరంలోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ) అథ్లెటిక్స్ మీట్‌కు హాజరైన జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేశ్

జేఎన్‌జే హౌసింగ్ సొసైటీకి అడ్‌హక్ కమిటీ ఎంపిక

జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి అడ్‌హక్ కమిటీ ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్న సహకార శాఖ అధికారి రమాదేవి తదితరులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి అడ్‌హక్ కమిటీ నియామకం ఆదివారం జరిగింది. నిజాంపేటలోని హౌసింగ్ సొసైటీ స్థలంలో జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు మ్యూక్ హౌసింగ్ సొసైటీ జనరల్ బాడీ సమావేశం హైదరాబాద్ జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా సహకార శాఖ రిజిస్ట్రార్ రమాదేవి అధ్యక్షతన సొసైటీకి కమిటీని నియమించారు. అడ్‌హక్ కమిటీకి ముంజేటి రామారావు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా పూకంటి శ్రీనివాస్ రెడ్డి, పామరతి హేమసుందర్, ఎస్ఎన్‌నీ ఎన్ ఆచార్యులు, ఎం.ఎ.సర్వర్ ఎన్నికయ్యారు. వీరి ఎంపిక నియామక పత్రాలను వారికి అందజేశారు. అడ్‌హక్ కమిటీ జనరల్ బాడీ సమావేశం శాంతియుత వాతావరణంలో జరిగిందని రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా సహకరించిన సహకార శాఖ అధికారులు, సమావేశానికి హాజరైన జర్నలిస్టులకు అభినందనలు తెలిపారు.

అలరించిన నిర్విరామ సంగీత విభావరి

కేటీ.సుందర్‌ను సత్కరించిన మాజీ కేంద్ర మంత్రి ఎస్.వేణుగోపాలాచారి

ముషీరాబాద్, ఫిబ్రవరి 4: జానకమ్మ కళాక్షేత్రం, నాగశ్రీ సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించిన కేటీ.సుందర్ నిర్విరామ సంగీత విభావరి శ్రోతలను అలరించింది. పురుష, స్త్రీ గళాలను అనుకరిస్తూ 108 సినీ, భక్తి గీతాలు ఆలపించి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించారు. ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి ఎస్.వేణుగోపాలాచారి ముఖ్య అతిథిగా హాజరై వండర్‌బుక్ రికార్డు పత్రాన్ని కెటి సుందర్‌కు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బింగి నరేందర్, పద్మాకర్ల్యాణ్, దీప్తి, విజయ్ పాల్గొన్నారు.

వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా, రాజమౌళి గుప్తా

ముషీరాబాద్, ఫిబ్రవరి 4: పేద వైశ్యులను ఆదుకోవడానికి వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకోసం త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలువనున్నట్లు తెలిపారు. ముషీరాబాద్ వైశ్య హాస్టల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కల్చరల్ కమిటీ యువజన విభాగం చైర్మన్‌గా వందనపు శైలేష్ గుప్తా, కమిటీ ప్రతినిధులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సలహా కమిటీ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తాతో కలిసి పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం ఐవీఎఫ్ కల్చరల్ కమిటీ మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా గోగుల అనురాధ, కో చైర్‌పర్సన్లుగా కృష్ణవేణి స్వాతి, బాల భద్రుని సుష్మ, గుండ శ్రీనివాస్, వీరేశం, భాస్కర్, శివకుమార్, గోవిందు, వెంకటరాజు, అనిల్ ప్రమాణ స్వీకారం చేశారు. ఐవీఎఫ్ ప్రతినిధులు సత్తయ్య, చంద్రశేఖర్, శ్రీనివాస్, మంజుల, రవికుమార్, చంద్రయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

అన్‌బ్రేకబుల్ స్పిరిట్ పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 4 : మల్టిపుల్ స్లెరోసిస్ (ఎంఎస్) దినాన్ని పురస్కరించుకొని ఆదివారం బేగంపేట్‌లోని హోటల్ తాజ్‌వివాంటలో 'అన్‌బ్రేకబుల్ స్పిరిట్' 'నావిగేటింగ్ లైఫ్ విత్ ఎంఎస్' పుస్తకావిష్కరణ సభ జరిగింది. మల్టిపుల్ స్లెరోసిస్ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేలా దేశంలోనే మొట్టమొదటి సారిగా విద్యావేత్త, రచయిత ఫరీదా రాజ్ రచించిన 'అన్‌బ్రేకబుల్ స్పిరిట్' పుస్తకాన్ని సీఆర్‌పీఎఫ్ మాజీ డీజీపీ దుర్గాప్రసాద్, ఆసఫ్ జాహి వంశం 9వ నిజాం రౌనక్ యార్‌ఖాన్, మల్టిపుల్ స్లెరోసిస్ (ఎంఎస్) సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకురాలు మీనాగుప్తా, అపోలో ఆసుపత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ సుధీర్‌కుమార్ హాజరై ఆవిష్కరించారు.

గ్రేటర్ @ 32.1డిగ్రీలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ఆగ్నేయం దిశ నుంచి తెలంగాణ వైపునకు వీస్తున్న గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.1 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20.1డిగ్రీలు, గాలిలో తేమ 43శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

జిల్లాలో తగ్గిన వరిసాగు

మేడ్చల్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో యాసంగిలో వరి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం కనిపిస్తుంది. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయశాఖ యాక్షన్‌ప్లాన్‌లో 13,400 ఎకరాల్లో వరి సాగుకు ప్రణాళికకు గాను ఇప్పటి వరకు 4 వేల ఎకరాల్లోపే వరి నాట్లు వేశారు. ప్రతి ఏడాది యాసంగి సీజన్‌లో జనవరి చివరి వారం వరకు వ్యవసాయ శాఖ యాక్షన్ ప్లాన్ మేరకు 13 వేల ఎకరాల్లో వరిసాగు నాట్లు పూర్తయ్యేవి. ఈ యేడు భిన్నంగా మారింది. ఇప్పటి వరకు 4 వేల ఎకరాల్లోపే వరి నాట్లు వేశారు. నాట్లు వేసే సమయం మించిపోవడంతో ఈ సీజన్‌లో జిల్లాలో వరి విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందన్న అభిప్రాయాన్ని వ్యవసాయాధికారులు వ్యక్తం చేస్తున్నారు. వరి నారు ఉన్నప్పటికి వరి నాట్లు మాత్రం అనుకున్న మేరకు నాటడం లేదు.

దుర్గం చెరువులో వాటర్ రెస్క్యూ పై శిక్షణ తీసుకుంటున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది..

ప్రతి నెల మొదటి ఆదివారం ఉచిత హెల్త్ క్యాంపులు

ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా వైద్య సేవలందించడానికి 'ప్రతి నెల మొదటి ఆదివారం' హెల్త్ క్యాంపులు నిర్వహిస్తూ స్వేచ్ఛ, కేర్ అండ్ కేరర్ ఛారిటీ, ఎస్‌వీకే సంస్థలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఉచిత క్యాంపునకు అనూహ్య స్పందన వస్తున్నది. ఈ సేవలందించడానికి ప్రొఫెసర్లు, ఐటీ ఉద్యోగులు, ఆడిటర్లు వలంటీర్లుగా పని చేస్తున్నారు. ఈ హెల్త్ క్యాంపు సేవలను బస్తీ ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు అత్యధికంగా ఉపయోగించుకుంటున్నారు. హెల్త్ క్యాంపులో పేషెంట్లకు నెలకు సరిపడా మందులు ఉచితంగా అందిస్తున్నారు. ఈ క్యాంపు రెండేండ్లుగా విజయవంతంగా కొనసాగుతున్నది. కంటి సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేసి కళ్లజోడు, సర్జరీ సైతం చేయిస్తున్నారు. ఇక్కడికొచ్చిన ప్రతీ పేషెంట్‌కు అన్నం కూడా ఉచితంగా అందిస్తారు. కాగా, ఇప్పటి వరకు 9 వేల మందికి పైగా సేవలందించారు. 50 మంది వైద్యులు ఈ హెల్త్ క్యాంపులో పనిచేశారు.

స్వర్ణనంది పురస్కారాలు ప్రదానం

కళానిలయం సాంస్కృతిక సంఘం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ సారస్వత పరిషత్తు హాలులో నృత్య గురువులతో పాటు చిందు యక్షగాన కళాకారుడు గడ్డం స్వామి, నటులు రాజీవ్ రవిచంద్రలకు స్వర్ణనంది పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారిని మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, సామాజికవేత్త డాక్టర్ కె.వీరభోగ వసంతరాయలు, నిర్వాహకులు సురేందర్ సత్కరించారు.

- తెలుగు యూనివర్సిటీ

8 నుంచి మహా రుద్రాభిషేకాలు

మియాపూర్, ఫిబ్రవరి 4 : హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన నగర్‌కు చెందిన శ్రీ గురుదత్త మఠం ఆధ్వర్యంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 8, 9వ తేదీల్లో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహా రుద్రాభిషేకం, కామాక్షి అమ్మవారికి దశ సహస్ర పర్యాయములు, విశేష ద్రవ్యాలతో 10 వేల అభిషేకాలు, తిరుపతిలోని పద్మావతి కల్యాణ మండపం హాలు -2లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నారాయణ మూర్తి ఆదివారం తెలిపారు. విశేషమైన ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయం అందించాలని కోరారు.

నేడు అయోధ్యకు ప్రత్యేక రైలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 4: రామ భక్తులు, బీజేపీ కార్యకర్తలు అయోధ్య రామమందిరాన్ని దర్శించుకోవడానికి సోమవారం ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌లు శ్యామ్‌సుందర్ గౌడ్, గౌతమ్‌రావు తెలిపారు. ఆదివారం ముషీరాబాద్ వైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ కార్యకర్తలు, రామ భక్తులకు అయోధ్య శ్రీరాముని దర్శనం కల్పించడానికి ప్రత్యేక రైలు ఏర్పాటు చేశారని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక రైలును జెండా ఊపి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

రేపు ఉచిత దంత వైద్య శిబిరం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడీఏ) డెక్కన్ బ్రాంచ్, ఆలిండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్(ఏఐఐఈ) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 6, 9, 12వ తేదీల్లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య శిబిరంలో పుచ్చి పళ్లు, ఫిల్లిడ్ టీత్స్ వంటి సమస్యలకు పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

క్యాన్సర్‌పై అవేర్‌నెస్ డ్రైవ్

రన్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

జూబ్లీహిల్స్ / కార్వాన్, ఫిబ్రవరి 4 : హైదరాబాద్ ఆర్టిలరీ సెంటర్, గోల్కొండ మిలిటరీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం 'క్లోజ్ ద కేర్ గ్యాప్' థీమ్‌తో గోల్కొండ గ్యారిసన్‌లో క్యాన్సర్ పై అవేర్‌నెస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 5 కె ట్రైమ్డ్ రన్, 3 కె ఫన్ రన్,1 కిలో మీటరు నడక కార్యక్రమాన్ని నిర్వహించి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 47 ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్ యూనిట్లకు చెందిన 800 మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆరోగ్యం అవగాహన పై విద్యార్థులకు నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

హిందీ ప్రచార సభ ఆస్తులను కాపాడాలి

హిందీ ప్రచార సభ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 4: తెలంగాణ హిందీ ప్రచార సభ పేరుతో కొందరు సభ్యులు చేస్తున్న ప్రకటనలను అధికారికంగా కొనసాగుతున్న హిందీ ప్రచార సభ కార్యవర్గం ఖండించింది. తెలంగాణ హిందీ ప్రచార సభ అధ్యక్షుడు జి.గాంధీ, కార్యదర్శి డాక్టర్ సాధిక్ పాషా, సురేందర్ ఆధ్వర్యంలో ఆదివారం నాంపల్లిలో ఏర్పాటు చేసిన అత్యవసర కార్యవర్గ సమావేశంలో హిందీ ప్రచార సభలో జరుగుతున్న అరాచకాలను తీవ్రంగా వ్యతిరేకించారు. రాష్ట్రానికి చెందిన హిందీ ప్రచార సభ ఆస్తులను కొల్లగొట్టడానికి కుట్రలు పన్నుతున్న గుర్తింపులేని సెంట్రల్ హిందీ ప్రచార సభకు చెందిన గైబువలిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం ఏర్పాటైన అనంతరం 2019లో ఏర్పడిన కమిటీనే ప్రస్తుతం కొనసాగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు సర్దార్ పాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేందర్, కోశాధికారి రామ్మోహనాచార్యులు, పరీక్ష సంచాలకులు మల్లారెడ్డి, సభ్యులు జకీర్‌పాషా, దినేశ్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

అన్‌బ్రేకబుల్ స్పిరిట్ పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 4 : మల్టిపుల్ స్లెరోసిస్ (ఎంఎస్) దినాన్ని పురస్కరించుకొని ఆదివారం బేగంపేట్‌లోని హోటల్ తాజ్‌వివాంటలో 'అన్‌బ్రేకబుల్ స్పిరిట్' 'నావిగేటింగ్ లైఫ్ విత్ ఎంఎస్' పుస్తకావిష్కరణ సభ జరిగింది. మల్టిపుల్ స్లెరోసిస్ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేలా దేశంలోనే మొట్టమొదటి సారిగా విద్యావేత్త, రచయిత ఫరీదా రాజ్ రచించిన 'అన్‌బ్రేకబుల్ స్పిరిట్' పుస్తకాన్ని సీఆర్‌పీఎఫ్ మాజీ డీజీపీ దుర్గాప్రసాద్, ఆసఫ్ జాహి వంశం 9వ నిజాం రౌనక్ యార్‌ఖాన్, మల్టిపుల్ స్లెరోసిస్ (ఎంఎస్) సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకురాలు మీనాగుప్తా, అపోలో ఆసుపత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ సుధీర్‌కుమార్ హాజరై ఆవిష్కరించారు.